# ఎత్తుకు పైఎత్తు

"ఒరేయ్ బాబూ! ఎట్లాగయినా నువ్వు ఈ సారి సాయం చేసి పెట్టాలి...." రావు మూర్తిని బతిమాలే ధోరణిలో అన్నాడు.

"నా పేరు బాబు కాదు, మూర్తి" అన్నాడు మూర్తి మధ్యలో కల్పించుకుంటూ, చిరాగ్గా.

"సార్! బిల్లు తెమ్మంటారా?" సర్వర్ వచ్చి ప్రశ్నించాడు.

"అప్పుడేనా బిల్లు? ఇంకా వేడిగా ఏమున్నాయి?"

సర్వర్ చెప్పబోతున్నాడు,

రావు విసుగ్గా చూశాడు. "సర్వర్ రెండు కాఫీ తీసుకురా...." సర్వర్ వెళ్ళిపోయాడు.

"అదేమిటి నా ఆకలి తీరనే లేదు. "మూర్తి గొణిగాడు.

"నీ ఆకలి తీరుస్తూ కూర్చుంటే అవతల పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. రేపు వచ్చి కూర్చుని తీరిగ్గా కావలసినంత తిను. ముందు నా ఆకలి సంగతిచూడు. నేను చెప్పింది జ్ఞాపకం ఉందిగా! నువ్వెవరివి?...." రావు ప్రశ్నించాడు-

"నేను.... నేను .. ఆఁ గుర్తొచ్చింది....."

మూర్తి సమాధానం చెప్పాడు కాస్త ఆలోచించి "మేనేజర్ని...."

"ఆఁ బొంబాయికంపెనీ జనరల్ మేనేజరువి" ఇంటర్వ్యూలు చేయడానికి ఇక్కడికి వచ్చావు! ఇదే నీపాత్ర. గుర్తు పెట్టుకో..." కాస్త కటువుగా అన్నాడు రావు.

"కానీ ఉద్యోగం కావలసిన వ్యక్తి రాకుండా ఎవరో..." మూర్తి నాన్చాడు.

"నువ్వా! నీ వెధవ తెలివితేటలు కట్టిపెట్టు. నీకు అవసరమైనంతవరకే మాట్లాడు. ఆ అమ్మాయి పేరు సుజాత. తన తమ్ముడికి ఉద్యోగం ఇప్పించమని అడుగుతుంది. అప్పుడు నువ్వు..."

సుజాతతో మూర్తి ఏ విధంగా మాట్లాడాలో అన్నీ వివరంగా చెప్పాడు రావు.

వెంటనే మూర్తి సుజాత అడ్రస్‌కు ఫోన్ చేసి ఆమె ఫలానా హోటల్ రూమ్‌కు రావాలంటూ చెప్పాడు. ఆమె రావడానికి అంగీకరిస్తుంది.

* * *

తనసహోద్యోగి అయిన సుజాతను ఎలాగయినా అనుభవించాలన్నది రావు కోరిక. ఆమెకోసం ఎన్నివిధాల ప్రయ

త్నించినా, ఎన్ని ఎత్తులు వేసినా ఫలించలేదు. సుజాత అతనికి అంద లేదు. ఆఫీసుకు వస్తే ఇంటికి వెళ్ళేవరకు తన పనేదో తప్ప కనీసం పక్క సీట్లోకి వెళ్ళి కూర్చుని మాట్లాడటం కూడా చేసేది కాదు. పని బాగా చేస్తుందని ఆఫీసరు ఎప్పుడూ మెచ్చుకుంటుండేవాడు. మెటర్ని టీలీవు, ఆరోగ్యం బాగా లేకపోతే అరుదుగా తప్ప ఆమె సర్వీస్‌లో లీవు పెట్టింది కూడా తక్కువే. పని ఆమె ఎంతబాగా చేస్తుందంటే ఆ సెక్ష న్‌లోకి కొత్తగా ఎవరు వచ్చినా పని సుజాత నేర్పవలసిందే. సుజాత అంటే అందరికీ చాలా గౌరవం. ఆమె చాలా మర్యాదస్తురాలు, నెమ్మదీ అని మంచి పేరు.

అట్లాంటి స్వభావం ఉన్న సుజాతంటే మొదట్లో రావుకుకూడా అందరితో పాటు గౌరవభావమే ఉండేది. కానీ సన్నగా. నాజూగ్గా, అందంకంటే ఆకర్షణ మేళవించి ఇద్దరు పిల్లల్ని కన్నా నునుపుచెడని సుజాత అంటే మొదట్లో ఉన్న పూజ్యభావం రానురాను మాయమై కళ్ళకు పొరలు కమ్మి సుజాత సొగసులు ఆఘ్రాణించాలనే కోరిక మిక్కుటమై చెలరేగిపోయింది.

ఆ రోజు క్రికెట్ మ్యాచ్ ఉండడం వల్ల చాలా మంది ఆఫీసుకు సెలవు పెట్టారు.

ఆ వేళ రావు కాస్త చనువు తీసుకుని సుజాతను పలకరించాడు. "ఏమండీ మీరెప్పుడూ ఎందుకంత సీరియస్‌గా ఉంటారు?"

ఆమె వెంటనే సీరియస్‌గా చూసింది.

"క్షమించాలి తప్పుగా అంటే!"

"మీరంతా కడుపునిండిన వాళ్ళు. అర్ధాకలితో ఉండే నా సమస్య మీకేం అర్థం అవుతుంది?" తన వ్యక్తిగత విషయాన్ని అనుకోకుండానే మొట్ట మొదటిసారి పైకి అనేసింది సుజాత.

"మిమ్మల్ని బాధ పెట్టినందుకు మన్నించండి. ఏదో తోటి ఉద్యోగస్థుడిగా, స్నేహితుడిగా మీ బాధ పంచుకుందామని...." రావు అన్నాడు.

ఆమె తన బాధ ఎప్పుడూ బయట పెట్టుకోలేదు గనక గత పదేళ్ళుగా ఆమె ఓదార్పు ఎరగదు. ఈ రోజు రావు మాటలకి సుజాత మనసులో ఒక స్పందన కలిగింది.

"రావు గారూ! మీరేదయినా సాయం చెయ్యగలిగితే మా తమ్ముడికి ఉద్యోగం ఇప్పించండి. అంతకంటే ఇంకేం అవసరం లేదు." అనేసింది సుజాత. కానీ ఒకరిముందు చేయి చాచి అడగడం అలవాటులేని సుజాత వెంటనే సిగ్గుపడింది. ఎందుకు అడిగానా.... అని క్షణ కాలం బాధపడింది.

కానీ సుజాత పరిస్థితి ఇన్నేళ్ళకి ఆ మాట అడిగేలా చేసింది.

పెళ్ళయి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత భర్తతో ఎడబాటు భరించరాని ఆవేదన కలిగిస్తోంది. ఒంటరి తనం మనసును మెలిపెడ్తోంది. దానికి కారణం కొంతవరకు ఆమే.

పెళ్ళి కాకముందు, సుజాత తన జీతాన్ని తన తమ్ముడికి ఉద్యోగం వచ్చేవరకు తన పుట్టింటికి ఇచ్చేట్లు ఒప్పందం కుదిరింది. సుజాత భర్త ప్రభాకర్ సంతోషంగానే ఒప్పుకున్నాడు. అతను సహృదయుడు. చాలా కాలం ఆమెతో సహకరించాడు. అయితే ఎంత ప్రయత్నించినా, ఎంతకాలం గడిచినా సుజాత తమ్ముడికి ఉద్యోగమైతే రాలేదుగానీ సుజాత సంసారం పెరిగి మరో ఇద్దరు చిన్న కొత్త మెంబర్లు కుటుంబంలో చేరారు. ఖర్చులు చాలా పెరిగాయి ఒకడ్డి జీతంతో ఇల్లు గడపడం కష్టంగా ఉన్న రోజుల్లో ప్రభాకర్ అన్నాడు.

"సుజాతా! నా ఒకడ్డి జీతం సరిపోవడం లేదని నీకు తెలుసు. చాలా కాలం నీ జీతం మీ ఇంటికే ఇచ్చావు. ఇప్పుడిక అది సాధ్యపడేట్లు లేదు. నీ జీతం కూడా ఇంట్లోనే వాడుదాం."

సుజాతకు తెలుసు- ఎన్ని ఖర్చులుతగ్గించినా డబ్బు చాలడంలేదు. అయినా కన్న కూతురుగా పుట్టింటిని ఆదుకోవాల్సిన బాధ్యత తనకుంది. అమ్మ, నాన్న పెద్దవాళ్ళయ్యారు. తమ్ముడికా ఉద్యోగం రాలేదు. కన్న వాళ్ళ పరిస్థితి కన్నీళ్ళతో వివరించింది సుజాత.

కానీ ప్రభాకర్ ఒప్పుకోలేదు.

ఇద్దరి మధ్యా ఘర్షణ చెలరేగింది. మాటామాటా పెరిగింది.

భర్తంటే సుజాతకు చాలా ప్రేమ.

కానీ, ఈ తుఫానువల్ల ఇద్దరూ తాత్కాలికంగా విడిపోవాల్సి వచ్చింది.

"సుజాతా! నీ జీతం కూడా ఇంట్లో ఖర్చు చేసినప్పుడే ఇద్దరం కలిసి ఉండడం జరుగుతుంది. లేకపోతే మనం ఒకదగ్గరుండటం కుదరదు" అన్నాడు ఖచ్చితంగా ప్రభాకర్ మాటమీద మాట వచ్చి.

"నేను మా కుటుంబాన్ని నడిసముద్రంలో ముంచి బయటికి రాలేను" అంది సుజాత.

దీని ఫలితమే చెరొక చోటా ఉండటం.

ఈ సమస్యకు పరిష్కారం కుదరాలంటే సుజాతతమ్ముడికి ఉద్యోగం రావాలి.

ఇప్పటికి వారి ఎడబాటుకి ఆరునెల్ల వయసొచ్చింది. ఆమె తన భర్త చెంతకు వెళ్ళి చేరాలని ఆత్ర పడుతోంది, రేయింబవళ్లు కడుపులో ఏదో దిగులు. అందుకే రావు తన తమ్ముడికి ఉద్యోగం ఇప్పిస్తానంటే ఆత్రపడింది.

రావుకి మాత్రం ఆమెఅందాలు తనసొంతం చేసుకోవడం ధ్యేయం. అతను కడుపునిండినవాడు. కాస్తో కూస్తో ఆస్తిపాస్తులున్నాయి. భార్యా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయినా ఆడవాళ్ళతో ఆడుకోవడం అతనికి సరదా! వాళ్ళ అందాలను విందు చేసుకోవడం అతనికి పసందు. ఎప్పుడూ భార్యేనా? పాత చింతకాయ పచ్చడిలా.

రోజుకొక ఆడదాన్ని అనుభవించడం. రోజుకో కొత్త రుచిని ఆస్వాదించడం- అందుకు పథకాలు వేయడం అదొక థ్రిల్. ఇప్పుడు రావు ఆ థ్రిల్లే అనుభవిస్తున్నాడు. అతనికి ఆమె బాధ వెనక వున్న వేదన అక్కరలేదు.

సుజాత ఆటో దిగడం కూడా గమనించలేదు రావు ఆలోచనల్లో పడి.

"నమస్కారం!" అంది ఆటోదిగి రావును సమీపిస్తూ సుజాత.

అప్పుడు వచ్చాడు రావు ఈ లోకంలోకి.

"ఆః వచ్చారా? రండి రండి. ఆ మేనేజరు చాలా ఆలస్యమైందని మండిపడుతున్నాడు. పదండి వెళ్దాం" అన్నాడు ఆమెను తొందరచేస్తూ.

"నాకు చాలాభయంగా ఉందండీ! ఇలాంటి హోటళ్ళకి నేనెప్పుడూ రాలేదు." సుజాత కళ్ళల్లో భయం కదలాడింది.

"మరి మీ తమ్ముడికి ఉద్యోగం..." ఆమె చేజారిపోతుందేమోనన్న ఆత్రంతో ఆమె బలహీనతను వెంటనే జ్ఞాపకం చేశాడు రావు.

ఆమె నిరాశగా, భయంగా అడుగులు ముందుకు వేసింది.

ఇక తన ప్రయత్నంలో భాగంగా లిఫ్టులో ఎక్కినప్పుడు ఆమెను తాకుతూ నిలబడాలని ప్రయత్నించాడు. కానీ ఆమె ఓ మూలకి ఒదిగిపోయింది.

రావు అన్నాడు — "మీరు మరీ అంత రిజర్వ్‌డుగా ఉంటే లాభం లేదండీ!"

సుజాత సీరియస్‌గా చూసింది

సర్దుకున్నాడు రావు "అబ్బే, వేరే ఉద్దేశం లేదు సుజాతగారూ! మీరు కాస్త స్నేహపూర్వకంగా నవ్వుతూ ఉంటే మీ పని సానుకూల మవుతుంది. వెళ్ళేది మీ తమ్ముడి ఉద్యోగం కోసం అది మీకు ముఖ్యమైన విషయం కదా!"

సుజాత నవ్వింది. రావు కుదుటపడ్డాడు.

"మీరు ఇక్కడ కూర్చోండి. నేను లోపలికెళ్ళి మాటలాడివస్తాను" అన్నాడు రావు అక్కడున్న సోఫా చూపిస్తూ.

రావు మాటవరకొండవ రూమ్‌లో కెళ్ళాడు. తలుపుతట్టి "ఒరేయ్ జాగ్రత్త! సుజాత వచ్చింది. ఇప్పుడే లోపలికి పంపిస్తాను" అన్నాడు హడావుడిగా.

"బాస్! ఈ టైప్ నాటకం నేనాడలేను. నాకెందుకో భయంగా ఉంది. నేనాడనీ నాటకం...." మూర్తి టెన్షన్‌గా అన్నాడు.

"నాటకం ఆడవా? ఆ డబ్బిటు పడెయ్. నీ పిల్లాడి ఫీజు సంగతేమిటో ఆలోచించుకుని బయటికి నడువ్!" కఠినంగా అన్నాడు రావు.

మూర్తి నీరుకారిపోయినాడు. "అవును! అ బ హీనతతో అడిస్తు న్నావు కనుకే ఒక ఆడకూతురు నీలాంటి కామాంధుడికి బలి అవు తున్నా...."

"షటప్! నీ నీతులు ఎవడిక్కావాలి? నీ డ్యూటీ నువ్వు చెయ్యి" కోపంగా తలుపువేసి బయటికి నడిచాడు రావు.

"నాకు భయంగా ఉంది మీరుకూడా లోపలికి రాకూడదూ!" సుజాత కొంగు నిండా కప్పుకుంటూ అంది.

"భయపడితే మీ తమ్ముడికి ఉద్యోగం రాదు." నిర్లిప్తంగా అన్నాడు రావు. ఊరికే ఆ అమ్మాయి భయం అనడం అతనికి విసుగ్గా ఉంది. ఈ కాలయాపన అతని కేమాత్రం నచ్చడం లేదు.

సుజాత తలుపు తోసుకుని లోపలికి నడిచింది. మనసెంత చిక్క బట్టుకున్నా ఇట్లా హోటల్లో ఓ గదిలోకి ఒంటరిగా వెళ్ళడం ఆమెలో భయాన్ని ఏ మాత్రం తగ్గించడం లేదు.

మూర్తి ఆమెను సాదరంగా ఆహ్వానించాడు. కూర్చోమన్నాడు.

"మీరు భయపడకండి! మీరెందుకు వచ్చారో, మీ సమస్యలేమిటో నాకు మిష్టర్ రావ్ చెప్పారు"

రూమ్ బయట రావు జుట్టు పీక్కుంటున్నాడు. అర్ధగంట గడి

చింది. మూర్తి బయటికి రాలేదు. ఒక వేళ వాడు ఆమెని.... ఛ! మూర్తి అట్లాంటివాడుకాదు....

తలుపు తెరవబోయాడు. కానీ లోపల బోల్టు వేసిఉంది. చివరికి తలుపు కొట్టాడు.

మూర్తి తలుపు తీశాడు. బయటికి రాగానే కోపంగా అన్నాడు. "ఐదు నిమిషాల్లో బయటికి రావాలని చెప్తే లోపల ఏం ఏడుస్తున్నావ్?"

అతనేం మాట్లాడలేదు. గబగబా అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు రావు ఆ గదిలోకి అడుగు పెట్టాడు. నవ్వుతూ అడిగాడు. "ఏం. సుజాతా! పని అయినట్లేనా? నువ్వు నిశ్చింతగా ఉండొచ్చు. మీ తమ్ముడికి ఉద్యోగం వచ్చేస్తుంది...." అతనికి తెలియకుండానే మీరు అనే గౌరవవాచకం నువ్వులోకి మారిపోయింది.

సుజాత అటు తిరిగి కూర్చుని ఉంది.

"ఏమిటి మాట్లాడవేం? ఆ రాస్కెల్ నిన్నేమన్నా అన్నాడా? అసలు ఇంటర్వ్యూ ఐదు నిమిషాలే అని వెధవ అరగంటసేపు ఏం చేశాడు?" ఆత్రంగా అడుగుతున్నాడు రావు.

అప్పటికి సుజాత మాట్లాడలేదు. మరో నిమిషానికి ఏడవడం మొదలుపెట్టింది.

ఆమెను సమీపించి రావు అన్నాడు. "ఏడవకు సుజాతా! నేను నిన్నేమన్నా చేశాననుకుంటారు ఎవరన్నా చూస్తే.... కళ్లుతుడుచుకో...." ఆమె కళ్ళు తుడిచే ప్రయత్నం చెయ్యబోతున్న రావువంక సుజాత తీక్షణంగా చూస్తూ దూరంగా జరిగి బల్ల మీద ఉన్న గాజు గ్లాసు తన చేతిలోకి తీసుకుంది.

"వాడేదో చేశాడని నా మీద పగతీర్చుకుంటావా సుజాతా! అయినా నువ్వూ ఆ వెధవ రాస్కెల్‌ని ఇష్టపడే వాడి పక్కన పడుకుని ఉంటావు. లేకపోతే నీకు ఇష్టం లేకపోతే అరిచి గోలచేసి ఉండే దానివి కాదా? అయినా ఇన్నాళ్ళూ పెద్దపతివ్రతలా పోజుకొట్టావెందుకు?...."

సుజాత కళ్ళు ఎర్రబడ్డాయి. పెదవులు వణుకుతున్నాయి. అదేం పట్టించుకోకుండా రావు చెప్తూనే ఉన్నాడు. "ఆ పిచ్చి వెధవ నిన్ను ఎట్లాగూ అనుభవించాడు. అసలు ముందు నేనే నిన్ను అనుభవించాలనుకున్నాను. నీలోని అణుఅణువూ నా సొంతం చేసుకుని స్వర్గసుఖాలందాలనుకున్నాను. ఆఫూల్ నిజంగా నీతమ్ముడికి ఉద్యోగం ఇస్తాడని నమ్ముతున్నావా? వాడికే ఠికానాలేదు. నీ తమ్ముడికేం ఇస్తాడు? వాడిచేత నాటకం ఆడించాను. అంతే! ఇప్పుడు నువ్వు నేను చెప్పినట్లు ఆడాలి.... కమాన్, వచ్చేయ్! నీకూ నాకూ మధ్య గాలి కూడా చొరకూడదు. బర్త్ డే డ్రస్‌లో కొచ్చేయ్. గొడవచేస్తే నీకే నష్టం - అసలే పాపం సీతా' సావిత్రుల్లా నీకు చాలా మంచి పేరుంది. నువ్విప్పుడు కాదంటే ఆ మూర్తి

గాడు నిన్ను పాడుచేశాడని ప్రచారంచేసి నీ సంసారం కూలదోస్తా...." అంటూనే ఆమెకు దగ్గరగా వెళ్ళి నడుం మీదుగా చెయ్యేసి దగ్గరికి లాక్కున్నాడు రావు. ఆమె చేతిలో గ్లాసు కిందపడి ముక్కలు ముక్కలైంది. సుజాత అతనితో పెనుగులాడుతూ ఒక్కతోపు తోసింది. ఇనుమడించిన కోపం, కసీ, మళ్ళీ ఆమె మీదికి దూకి ఒక్కతోపు తోశాడు. ఆమె విడిపించుకునే ప్రయత్నంలో రావును ప్రతిఘటిస్తూనే ఉంది.

బయట తలుపులు చప్పుడు.

సుజాతలో ఆశాకిరణం తళుక్కుమంది.

రావు మొహం వెల వెల బోయింది.

ఒక్కక్షణం చెయ్యిపట్టు తప్పించిన రావు కుంచి తప్పించుకుని తలుపు బోల్టు తీసింది సుజాత.

ఎదురుగా ఉన్న పోలీసులనుచూసి నిర్ఘాంతపోయాడు రావు. అవకాశం రాగానే పోలీసుల ముందే రావు చెంప ఛెళ్ళుమనిపించింది సుజాత.

రావుకు మనసు, ఒళ్లు మండిపోతున్నై.

"మిష్టర్ రావ్! నీమీద ఇంతకుముందు కూడా ఆడపిల్లల్ని రేప్ చేసిన కేసులున్నై. కానీ ఈరోజు మూర్తిగారివల్ల నీ ఆట కట్టింది" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"రాస్కెల్! నా డబ్బు తిని నన్నే మోసం చేస్తావా?...." బుసలు కొట్టాడు రావు ఇన్‌స్పెక్టర్ పక్కనున్న మూర్తిని చూసి.

పోలీసులు రావును అరెస్టుచేసి తీసుకెళ్ళారు.

(మయూరి సచిత్ర వారపత్రిక 19-2-86)